# యాసంగిలో వేరుశనగ సాగు మేలు



గరిడేపల్లి మండలంలో వేరుశనగ సాగు

- తగినంత తేమ ఉన్నప్పడే విత్తుకోవాలి
- అవసరాన్ని బట్టి ఎరువులు వాడాలి
- సాగులో స్ప్రింకర్ల వాడకంతో నీటి పొదుపు

గరిడేపల్లి, డిసెంబర్ 7 : యాసంగిలో వేరుశెనగ సాగు మేలైనది. వానాకాలంలో వర్షాధారంగా, యాసంగిలో నీటి పారుదల కింద సాగు చేయవచ్చు. సాగర్ ఆయకట్టులో ఈసారి నీరు ఇబ్బందికరంగా ఉన్నందున రైతులు తమకున్న కొద్దిపాటి నీటి వనరులతో యాసంగిలో వేరుశనగ సాగు మంచి ఫలితాలు ఇస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. వేరుశనగ సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త దొంగరి నరేశ్ వివరించారు. అదనపు సమాచారం కోసం 9290615952 నంబర్‌ను సంప్రదించవచ్చు.

**నేలల ఎంపిక :** వేరుశనగ పంటకు నీరు త్వరగా ఇంకే తేలిక నేలలు చాలా అనుకూలము. సేంద్రియ పదార్థము తగినంతగా ఉండి కాల్షియం, గంధకము ఉండే భూములు శ్రేష్టమైనవి. ఉదజని సూచిక 6 నుంచి 7.5వరకు ఉన్న నేలలు మంచివి. ఎక్కువ బంకమన్ను గల నల్లరేగడి నేలల్లో పంట వేయకూడదు.

**నేల తయారీ :** వేసవిలో లోతు దుక్కులు చేయడంతో పంటను నష్టపరిచే కీటకాలు, తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చు. విత్తే ముందు నేలను మెత్తగా దుక్కి చేసి చదును చేయాలి.

**విత్తన మోతాదు :** గింజ బరువు, విత్తే సమయము బట్టి విత్తన మోతాదు మారుతుంది. యాసంగికి ఒక ఎకరానికి 60నుంచి 70కిలోలు విత్తాలి.

**విత్తు దూరం :** నీటి పారుదల కింద యాసంగి పంటలో గుత్తి రకాలకు 22.5x 10 సెం.మీ, తీగ గుత్తి రకాలకు 22.5x 15 సెం.మీ దూరం విత్తుకోవాలి.

**విత్తు పద్ధతి :** విత్తనాన్ని గొర్రుతో గానీ లేక నాగలి చాళ్లలో గానీ లేక ట్రాక్టర్‌తో నడిపే విత్తు యంత్రంతో గానీ విత్తాలి. విత్తే సమయంలో నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు 5సెం.మీ లోతు మించకుండా విత్తుకోవాలి. ట్రాక్టర్ డ్రిల్‌ను వాడినట్లైతే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణం విత్తుకోవడమే కాక ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చు.

**ఎరువుల మోతాదు :** భూసార పరీక్షలు అనుసరించి ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలి.

**సాగునీటి యాజమాన్యం :** సంవత్సరం వర్షపాతం 400–450 మి.మీ ఉన్న ప్రాంతాలు వేరుశనగ సాగుకు అత్యంత అనుకూలం. తేలిక నేలల్లో 8,9 తడులు పెడితే సరిపోతుంది. విత్తే ముందు నేల బాగా తడిసేటట్లు నీరు పెట్టి తగినంత తేమ ఉన్నప్పుడు విత్తనం వేయాలి. రెండో తడిని విత్తిన 20నుంచి 25రోజులలో (మొదటి పూతలో) ఇవ్వాలి. అనంతరం నేల స్వభావాన్ని బట్టి 8నుంచి 10రోజులకో మారు నీటి తడి ఇవ్వాలి. ఆఖరి తడి పంట కోతకు 15రోజుల ముందు ఇవ్వాలి. ఊడలు దిగే దశ నుండి కాయలు ఊరే దశ వరకు (విత్తిన 45–50రోజుల నుంచి 85–90 రోజుల వరకు) సున్నితమైనది. కనుక ఈ దశలో నీరు సక్రమంగా తగు మోతాదులో కట్టుకోవాలి. నీటిని స్ప్రింకర్ల ద్వారా అందిస్తే 25% నీటి ఆదాతో పాటు దిగుబడి పెరుగును.

### మెలకువలతోనే అధిక దిగుబడులు



యాసంగి పంటగా సాగు చేసే వేరుశనగలో చిన్న చిన్న వెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చు. నేలలను తయారు చేశాక విత్తడానికి ముందు విత్తన శుద్ధి చేసి సూచించిన దూరంలో విత్తుకోవాలి. తర్వాత అవసరం మేరకు ఎరువులు వేస్తూ నీటి తడులను ఇస్తే మంచి దిగుబడులను పొందవచ్చు. నీటిని స్ప్రింక్లర్‌తో అందిస్తే నీరు పొదుపు కావడమే గాక మంచి దిగుబడులు సాధించవచ్చు.

*– దొంగరి నరేశ్, కేవీకే శాస్త్రవేత్త, గడ్డిపల్లి*



కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు

## మట్టపల్లిలో ఘనంగా నిత్య కల్యాణం

మఠంపల్లి, డిసెంబర్ 7 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనర్సింహ స్వామి క్షేత్రంలో నిత్య కల్యాణాన్ని అర్చకులు గురువారం శాస్త్రోక్తంగా జరిపించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మేళ్లచెర్వు, డిసెంబర్ 7 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు తెలిపారు. జువారి సిమెంట్స్ ఆర్థిక సహకారంతో మండలంలోని రామాపురం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రంగిశెట్టి సైదయ్య, రసూల్‌ఖాన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు



జోజిరెడ్డి ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

## జోజిరెడ్డి సేవలు మరువలేం

### సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాశ్

పాలకవీడు, డిసెంబర్ 7 : సీపీఎంకు జోజిరెడ్డి చేసిన సేవలు మరువలేమని సీపీఎం మండల కార్యదర్శి అనంత ప్రకాశ్ అన్నారు. జోజిరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గురువారం ఆయన ఫ్లెక్సీకి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత ప్రకాశ్ మాట్లాడుతూ జోజిరెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమం లో ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, నాయకులు పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్లు, నందయ్య, రాంరెడ్డి, నాగిరెడ్డి, సైదులు, సుజాత పాల్గొన్నారు.

## టీఎస్ సెట్‌లో పడ్మట్‌పల్లి వాసి ప్రతిభ



పల్లె నాగార్జున

దేవరకొండరూరల్, డిసెంబర్ 7 : మండలంలోని పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె నాగార్జున ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన టీఎస్ సెట్ పరీక్షలో ప్రతిభ కనబర్చి ఉత్తీర్ణత సాధించాడు. రాష్ట్ర వ్యాప్తంగా 39 వేల మంది పరీక్ష రాయగా.. 2వేల మంది మాత్రమే అర్హత సాధించారు. నాగార్జున ఉస్మానియా యూనివర్సిటీ లోనే ఆంగ్లంలో పీజీ పూర్తి చేశాడు. సెట్ పరీక్షలో అర్హత సాధించడంపై గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రామాలయ గుడి ద్వార గుమ్మం ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా రామాలయ ద్వార గుమ్మం ప్రతిష్ఠ

నేరేడుచర్ల, డిసెంబర్ 7 : పట్టణంలోని సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న కోదండ రామాలయం వద్ద సాంప్రదాయ సిద్ధంగా ద్వారగుమ్మం ప్రతిష్ఠ మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తాసీల్దార్ కార్యాలయ సమీపంలో పట్టణానికి చెందిన రాచకొండ రామచందర్‌రావు సోదరులు, కుటుంబ సభ్యులు 18గుంటల స్థలాన్ని విరాళంగా ఇవ్వగా దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నారు. వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నీలి గొండ వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్ సాయితో పాటు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వర్షానికి నేలవాలిన వరి



రాగడపలో నేలవాలిన వరిచేను

త్రిపురారం, డిసెంబర్ 7: తుఫాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి చేను నేలవాలింది. కొంత మంది రైతులు సన్నాలకు బదులుగా సాంబమసూరి సాగు చేశారు. వాటి కోత సమయం మరో పదిహేను రోజులు ఉండగా.. మూడు రోజులుగా కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి వరిపంటంతా నేలవాలింది. పొలాల్లో నీళ్లు నిల్వ ఉండడంతో నేలవాలిన వరి కంకులు మొలకెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ సారి సాగునీరు తక్కువగా ఉన్నా కష్టపడి పంటను పండిస్తే అకాల వర్షం పంటను దెబ్బతీసిందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



నేరేడుచర్లలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు

## తపాలా ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల, డిసెంబర్ 7 : ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్ పిలుపు మేరకు గ్రామీణ తపాల ఉద్యోగుల ఈ నెల 12నుంచి చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నేరేడుచర్ల పోస్టాఫీస్‌లో గురువారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం సూర్యాపేట డివిజన్ కన్వీనర్ జి.నాగరాజు మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగులకు 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు కల్పించాలన్నారు. సీనియర్ ఉద్యోగులకు 12,24,36సంవత్సరాల సర్వీస్‌కు అదనపు ఇంక్రిమెంట్ మంజూరు చేసి ఆర్థిక ఉన్నత కల్పించాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలు, గ్రాట్యూటీని రూ. 5లక్షలకు పెంచాలన్నారు. కుటుంబసభ్యులు వైద్య సౌకర్యం కల్పించాలని, టార్గెట్ మేళాల వేధింపులను నిలిపివేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. సమ్మెలో గ్రామీణ తపాల ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు రామ నర్సయ్య, రమేశ్, జ్యోతి, చెన్నయ్య, పుల్లయ్య, నారాయణ, అశ్విని, ఉష, సునీత, శివ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
COMMERCIAL PLOT MAIN ROAD 12X60 PEDDAVOORA (HLIYA TO 14 KM) NALGONDA DIST.
CON : 9247272429.
NLG-

WANTED
★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1)
శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |